నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I హైదరాబాద్, శనివారం 13 ఏప్రిల్ 2024 | HYDERABAD


## వర్షసూచన



సిటీబ్యూరో, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): ఉపరితల ద్రోణి, ఆవర్తన ప్రభావంతో రాగల 24 గంటల్లో గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వాన కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. దీంతో నగరానికి ఆరెంజ్ అలర్ట్ హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటికే ద్రోణి ప్రభావంతో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే తక్కువకు పడిపోయి, నగర వాతావరణం చల్లబడింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 34.6, కనిష్ఠం 24.9 డిగ్రీలు, గాలిలో తేమ 42 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

## చిన్నారిపై వీధి కుక్క దాడి



గాయపడిన అనన్య

దుండిగల్, ఏప్రిల్ 12: నాలుగేండ్ల చిన్నారిపై వీధి కుక్క దాడి చేసి గాయపరిచింది. దుండిగల్ విలేజ్‌లోని కొరివిబస్తీకి చెందిన శ్రీలత, విజయ్ దంపతుల కూతురు అనన్య శుక్రవారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటుండగా ఓ వీధి కుక్క దాడి చేయడంతో గాయపడింది. గమనించిన స్థానికులు కుక్కను అక్కడి నుంచి వెళ్లగొట్టారు. కుటుంబసభ్యులు బాలికను ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావు బ్లూక్రాస్ సంస్థకు సమాచారం ఇచ్చారు. ఆ సంస్థ ప్రతినిధులు అక్కడికి చేరుకొని వీధి కుక్కలను పట్టుకెళ్లారు. అనంతరం కమిషనర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. గ్రామంలో కుక్కల బెడద లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా వీధి కుక్కల బెడద ఉంటే తమ దృష్టికి తీసుకురావాలంటూ.. 99487 95556, 90300 95839, 95427 15377 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.





సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

# చలో చేవెళ్ల

### గులాబీ అడ్డాలో నేడు కేసీఆర్ సభ

**భారీ జన సమీకరణకు ఏర్పాట్లు**

**2 లక్షల వరకు వస్తారని అంచనా**

**సభా ప్రాంగణంలో గులాబీ జెండాల రెపరెపలు**

**ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**

రంగారెడ్డి, ఏప్రిల్ 12(నమస్తే తెలంగాణ): 'గులాబీ అడ్డ చేవెళ్లకు బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేడు వస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో శనివారం సాయంత్రం 5 గంటలకు జరిగే బహిరంగ సభలో పాల్గొంటున్నారు. ఉమ్మడి జిల్లాలో తొలి ఎన్నికల ప్రచార బహిరంగ సభ కావడంతో పార్టీ శ్రేణులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. సభను సూపర్ సక్సెస్ చేసేందుకు భారీగా జనాన్ని సమీకరిస్తున్నారు. సభ ఏర్పాట్లను మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి శుక్రవారం పరిశీలించారు. గులాబీ బాస్ రాకతో జిల్లాలో లోక్ సభ ఎన్నికల ప్రచారం కొత్త పుంతలు తొక్కనున్నది.

**గులాబీ సభకు సర్వం సిద్ధం**

లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహిస్తున్న బహిరంగ సభను బీఆర్‌ఎస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నది. చేవెళ్ల పార్లమెంటు పరిధిలో ఉన్న మహేశ్వరం, చేవెళ్ల, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, వికారాబాద్, పరిగి, తాండూరు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి భారీగా జనాన్ని సమీకరించేలా నేతలకు బాధ్యతలు అప్పగించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలు సభ విజయవంతానికి అహర్నిశలు కృషి చేస్తున్నారు. 2 లక్షల మందికి పైగా సభకు తరలివచ్చే అవకాశం ఉందని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నారు. ఎండ తీవ్రత నేపథ్యంలో సభకు వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మంచినీళ్లు తదితర వాటిని అందుబాటులో ఉంచుతున్నారు. సభకు వచ్చే వీఐపీలు, మీడియా, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళలు ఇలా.. వేర్వేరుగా గ్యాలరీలు, షాబాద్ నుంచి వచ్చే వాహనాలకు అదే రూట్‌లో పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేశారు. సభా స్థలికి కొద్ది దూరంలో రెండు చోట్ల పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. అక్కడే తమ వాహనాలను పార్కింగ్ చేసి కాలినడకన సభా ప్రాంగణానికి ప్రజలు చేరుకోవాల్సి ఉంటుంది. ఫరా కళాశాల మైదానంలోని విశాలమైన స్థలంలో సభకు ఏర్పాట్లు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే మైదానంలో బీఆర్‌ఎస్ పార్టీ సభ నిర్వహించింది. కేసీఆర్ రోడ్డు మార్గంలోనే సభకు రానున్నట్లు తెలిసింది. ఒకవేళ.. హెలికాప్టర్‌లో వస్తే.. అందుకు సైతం నేతలు ఏర్పాట్లు చేశారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ తదితరులు దగ్గరుండి సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



## కాసానిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం

**ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి**

**సభ ఏర్పాట్ల పరిశీలన**

షాబాద్ : నేడు చేవెళ్లలో జరిగే బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం చేవెళ్లలోని ఫరా ఇంజినీరింగ్ కళాశాలలోని సభా ప్రాంగణాన్ని స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర యువనేత కార్తిక్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. శనివారం చేవెళ్లలో జరిగే సభకు 2 లక్షల వరకు జనసమీకరణ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్త రాంబాబు యాదవ్, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌ను కలిసిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత

## కారు వైపే కంటోన్మెంట్

**బీఆర్‌ఎస్ శ్రేణులు క్రియాశీలకంగా పని చేయాలి**

**ఎమ్మెల్యేలు తలసాని, మల్లారెడ్డి**

కంటోన్మెంట్, ఏప్రిల్ 12: రానున్న నెల రోజుల పాటు కంటోన్మెంట్‌లోని బీఆర్‌ఎస్ శ్రేణులు అత్యంత క్రియాశీలకంగా పని చేసి గులాబీ జెండా ఎగిరే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, చామకూర మల్లారెడ్డి సూచించారు. శుక్రవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విజయీభవ అంటూ నివేదితను తలసాని ఆశీర్వదించారు. అనంతరం నివేదిత ఎమ్మెల్యే మల్లారెడ్డిని బోయిన్‌పల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా తలసాని, మల్లారెడ్డి మాట్లాడుతూ కంటోన్మెంట్ జనమంతా కారు వైపే ఉన్నారని, అధైర్యపడాల్సిన అవసరం లేదని, కలిసికట్టుగా ముందుకు సాగితే విజయం మనదేనన్నారు. నియోజకవర్గంలో ఏ వార్డులోకి వెళ్లినా 80 నుంచి 90 శాతం మంది ఓటర్లు బీఆర్‌ఎస్ వారే ఉన్నారని, ప్రతి వార్డులో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తున్నదన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉండటంతో పాటు పార్టీ శ్రేణులు, ప్రజలతో మమేకం కావాలని నివేదితకు సూచించారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న సేవలను కంటోన్మెంట్ ప్రజలు ఎన్నటికీ మరువబోరని చెప్పారు. అక్కడి నుంచి నేరుగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డితో నివేదిత సమావేశమయ్యారు. ఉప ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై నేతలు చర్చించారు. సాయన్న కుటుంబానికి ప్రజల్లో ఉన్న సానుకూలత నేపథ్యంలో మరింత ముమ్మరంగా ప్రచారం చేసి, భారీ మెజార్టీ సాధించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆయా సమావేశాల్లో మాజీ కార్పొరేటర్ రూప, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్, మురళీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## హామీల అమలేదీ?

**కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ సర్కారు**

**ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా తదితరులు

ఎల్బీనగర్ , ఏప్రిల్ 12: ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని, ప్రజల సమస్యలు తీర్చని ఈ ప్రభుత్వంపై భవిష్యత్‌లో ప్రజలే తిరుగుబాటు చేస్తారని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎల్బీనగర్ నియోజకవర్గంలోని లింగోజిగూడ, చంపాపేట, హస్తినాపురం డివిజన్ల బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల్లో చేతగాని హామీలు ఇచ్చి అమలు చేయకుండా కాలం గడుపుతోందన్నారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రంలో మంచినీరు, కరెంటు నిరాటంకంగా సరఫరా జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి కరెంటు, మంచినీటి కష్టాలు తెచ్చిందన్నారు. మల్కాజిగిరి పార్లమెంటు స్థానంలో బీఆర్‌ఎస్ పార్టీ అన్ని పార్టీల కంటే బలంగా ఉందని, రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి భారీ మెజార్టీని అందించాలన్నారు. ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా మాట్లాడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గంలో శ్రేణులంతా కలిసికట్టుగా పనిచేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలన్నారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మల్కాజిగిరి పార్లమెంటు స్థానంలో బీఆర్‌ఎస్ గెలుపును ఎవ్వరూ ఆపలేరన్నారు. తాను స్థానికుడినని, అందుబాటులో ఉండి సేవలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ముద్రబోయిన శ్రీనివాస్‌రావు, రమావత్ పద్మానాయక్, సీనియర్ నాయకుడు గజ్జల మధుసూదన్‌రెడ్డి, సుంకోజు కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

## శోభాయాత్రకు పటిష్ట భద్రత

**ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయ జెండాలు, ప్రసంగాలకు చోటు లేదు**

**ఊరేగింపు రూట్‌ను పరిశీలించిన నగర సీపీ**

సిటీబ్యూరో, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): శ్రీ రామ నవమి శోభాయాత్రకు సిటీ పోలీసుల ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని, నిర్వాహకులు పోలీసులకు సహకరించి పండుగను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శ్రీరామ నవమి వేడుకలకు సంబంధించి శుక్రవారం మంగళ్‌హాట్ సీతారాంబాగ్‌లోని ద్రౌపది గార్డెన్స్‌లో ఉత్సవ సమితి సభ్యులు, వివిధ ప్రభుత్వ విభాగాలు జీహెచ్‌ఎంసీ, ఆర్ అండ్ బీ, విద్యుత్ తదితర శాఖలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. శ్రీరామ నవమి ఊరేగింపు జరిగే 6.8 కిలోమీటర్ల మార్గాన్ని పరిశీలించారు. శోభాయాత్ర ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో శోభాయాత్రలో రాజకీయ జెండాలు, రాజకీయ ప్రసంగాలు లేకుండా చూసుకోవాలని సీపీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నగర అదనపు సీపీ విక్రమ్ సింగ్ మాన్, అదనపు సీపీ సత్యనారాయణ, జీహెచ్‌ఎంసీ జోన్ కమిషనర్ హేమంత్ సహదేవ్‌రావు, డీసీపీలు, ఇతర శాఖల అధికారులతో పాటు ఉత్సవ సమితి సభ్యులు భగవంతరావు, కృష్ణ, ఆనంద్ సింగ్, గోవింద్‌రాఠీ కిరోడి మాల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్రీరామ నవమి వేడుకలు, శోభాయాత్ర నేపథ్యంలో తీసుకోవాల్సిన బందోబస్తు ఏర్పాట్లపై నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి నగర పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శోభాయాత్ర సీతారాంబాగ్ ఆలయం వద్ద ప్రారంభమై హనుమాన్ వ్యాయమశాల వరకు కొనసాగుతుందని, ఈ ర్యాలీకి నగరంతో పాటు రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ల నుంచి వచ్చే ర్యాలీలు కలుస్తాయని సూచించారు. సీనియర్ పోలీసు అధికారుల పర్యవేక్షణలో ఎస్‌హెచ్‌వోలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సీపీ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు.



శోభాయాత్ర మార్గాన్ని పరిశీలిస్తున్న నగర సీపీ శ్రీనివాస్‌రెడ్డి



## పైగా ప్యాలెస్‌లోకి హెచ్‌ఎండీఏ

**లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రధాన కార్యాలయం**


సిటీబ్యూరో, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): చారిత్రాత్మక వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందిన బేగంపేట పైగా ప్యాలెస్‌ను హెచ్‌ఎండీఏ ప్రధాన కార్యాలయంగా మార్చే ప్రక్రియ మొదలైంది. హెచ్‌ఎండీఏ కార్యకలాపాలన్నీ ఒకే చోట నుంచి జరిగేలా చేయాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా జీవోను జారీ చేసింది. ప్రస్తుతం హెచ్‌ఎండీఏకు సంబంధించిన కార్యకలాపాలు అమీర్‌పేట, నానక్‌రాంగూడ, హుస్సేన్‌సాగర్ లుంబినీ పార్కు ప్రాంతాల నుంచి జరుగుతున్నాయి. వీటన్నింటినీ బేగంపేటలోని పైగా ప్యాలెస్‌లోకి మార్చేందుకు హెచ్‌ఎండీఏ ఇంజినీరింగ్ విభాగం అధికారులు చర్యలు చేపట్టారు. వారం రోజులుగా పైగా ప్యాలెస్‌లో ఉన్న భవనాలు, అక్కడ ఇప్పటికే ఉన్న మౌలిక వసతులను పరిశీలిస్తున్నారు. ఎలక్ట్రిక్ విభాగంతో పాటు ఐటీ, నెట్‌వర్కింగ్‌కు సంబంధించిన ఉద్యోగులు అక్కడి భవనాల్లో ఉన్న వనరులను గుర్తించే పనిలో ఉన్నారు. సుమారు లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో హెచ్‌ఎండీఏకు సంబంధించిన అన్ని కార్యకలాపాలు ఒకే చోట నుంచి జరిగేలా అవసరమైన మౌలిక వసతులను కల్పించనున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం దీనికి సంబంధించిన ప్రత్యేకంగా జీవోను సైతం జారీ చేయడంతో అధికారులు ఈ నెలాఖరు వరకు అందులో ఆఫీసు నిర్వహణకు అవసరమైన ఫర్నిచర్, వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారుల చాంబర్‌లు, వాటికి అవసరమైన మౌలిక వసతులపై నివేదికను రూపొందించనున్నారు. ఈ భవనం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానికి చెందినది కావడంతో దాన్ని సమర్థవంతంగా వినియోగించుకునేందుకు ఎలాంటి అదనపు నిర్మాణాలు చేపట్టాలన్న దానిపైనా ఇంజినీరింగ్ విభాగం అధికారులు అధ్యయనం చేస్తున్నారు. కాగా, ఆగస్టు నాటికి హెచ్‌ఎండీఏ కార్యాలయాల తరలింపు ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

### చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని ముద్రించి..

## ₹ 500 నకిలీ నోట్ల చెలామణి

**ఇద్దరి అరెస్టు.. రూ.6.62 లక్షల ఫేక్ కరెన్సీ స్వాధీనం**

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 12: రూ. 500 నకిలీ నోట్లు చెలామణి చేస్తున్న ముఠాను శంషాబాద్ ఎస్‌వోటీ, మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు పట్టుకున్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని ఉండాల్సిన నోట్లపై చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని ముద్రించి.. మార్కెట్‌లోకి అక్రమంగా నకిలీ నోట్లను చెలామణి చేస్తున్న ఇద్దరు నిందతుల వద్ద నుంచి రూ. 6.62 లక్షల విలువ చేసే ఫేక్ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్‌మధు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లా పుంగనూరు పట్టణానికి చెందిన గంగరాజు, అభినందన్‌లు.. మహారాష్ట్రకు చెందిన సచిన్ పవార్, సురేశ్ పవార్ ఫేస్‌బుక్‌లో పోస్టు చేసిన నకిలీ కరెన్సీ వీడియోను చూసి వారిని సంప్రదించారు. వారి వద్ద నమూనాగా 10 నకిలీ నోట్లను కొనుగోలు చేశారు. సికింద్రాబాద్‌లో ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన లక్ష్మి అనే వ్యక్తికి ఐదు నోట్లను ఇచ్చి మార్కెట్‌లో మార్పిడి చేయించారు. సులభంగానే మారుతున్నాయని గ్రహించి.. గంగరాజు 3.5 లక్షలు పోగు చేసుకొని బెంగళూరు, సూరత్, నందుర్‌బార్ మీదుగా మహారాష్ట్రలోని చద్వేల్‌కు చేరుకున్నారు. అక్కడ సచిన్ పవార్, సురేశ్ పవార్‌లను కలిసి 17 లక్షల నకిలీ నోట్లను తీసుకొని 3.5 లక్షలు (1:5 నిష్పత్తి) చెల్లించారు. సికింద్రాబాద్‌లోని లాడ్జీలో బస చేశారు. మల్కాజిగిరిలోని సాయిరాం థియేటర్ సమీపంలో నరేశ్ అనే వ్యక్తి సాయంతో బైక్‌ను అద్దెకు తీసుకొని




నకిలీ నోట్లను విక్రయించేందుకు మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మెహిఫిల్ రెస్టారెంట్‌కు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు గంగరాజు, అభినందన్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మగపిల్లాడినై పుడుతా..

**మెసేజ్ పెట్టి.. యువతి బలవన్మరణం**

జవహర్‌నగర్, ఏప్రిల్ 12: 'ఆడపిల్లనని బాధపడొద్దు.. మగపిల్లాడినై పుడుతా'.. అంటూ.. ఆ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పమని... స్నేహితురాలికి మెసేజ్ పెట్టిన ఓ యువతి.. బలవన్మరణానికి పాల్పడింది. జవహర్‌నగర్ ఎస్సై అనిల్‌కుమార్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం... కార్మికనగర్‌లో మనోహర్, లావణ్య దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారి కుమార్తె చిత్ర శివాని(18) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నది. శుక్రవారం ఉదయం కాలేజీకి వెళ్లింది. ఇంటికి వచ్చే క్రమంలో సాయినగర్‌కాలనీలోని డబుల్ బెడ్రూం ఇండ్ల వద్దకు వెళ్లి.. బిల్డింగ్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. చనిపోయే ముందు 'ఆడపిల్ల... ఆడపిల్ల అని బాధపడకండి... మరో జన్మంటూ ఉంటే మగపిల్లాడినై మీ కడుపులోనే పుడతా'.. అంటూ... తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచిస్తూ.. తన స్నేహితురాలి మొబైల్‌కు మెసేజ్ పంపించింది.




విజేతలకు బహుమతులను అందజేస్తున్న క్రీడాకారిణి సానియా మీర్జా, చిత్రంలో సీవీ ఆనంద్

### స్పాన్సర్ల మద్దతు ఉంటే..

## అద్భుత క్రీడాకారులు వెలుగులోకి

**ఏసీబీ డీజీ సీవీ ఆనంద్**

బంజారాహిల్స్, ఏప్రిల్ 12 : మన దేశంలో క్రికెట్‌కు ఉన్న ఆదరణ ఇతర క్రీడలకు లేదని, ఆయా క్రీడాకారులు అవసరమైన ఆర్థిక వనరుల కోసం ఇబ్బంది పడే పరిస్థితులు ఉన్నాయని ఏసీబీ డైరెక్టర్ జనరల్ సీవీ ఆనంద్ అన్నారు. ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో ఏఫ్ఎన్‌సీసీ ఓపెన్ టెన్నిస్ పురుషుల విభాగం టోర్నమెంట్ విజేతలకు బహుమతి ప్రదానం కార్యక్రమానికి ఆయన టెన్నిస్ క్రీడాకారిణి సానియా మీర్జాతో కలిసి హాజరై మాట్లాడారు. ఐపీఎల్ తరహాలో ఇతర క్రీడలకు కూడా స్పాన్సర్ల మద్దతు దొరికితే అనేక మంది అద్భుత క్రీడాకారులు వెలుగులోకి వస్తారని సీవీ ఆనంద్ అన్నారు. సానియా మీర్జా మాట్లాడుతూ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లేందుకు డబ్బులు లేక చాలామంది క్రీడాకారులు ఆటలకు దూరమవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ అధ్యక్షుడు ఆదిశేషగిరి రావు, స్పోర్ట్స్ కమిటీ చైర్మన్ చాముండేశ్వరినాథ్, కార్యదర్శి ముళ్లపూడి మోహన్ తదితరులు పాల్గొన్నారు.